మరోసారి మెజార్టీ ఇద్దాం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, జనవరి 20: బీఆర్ఎస్‌కు కంచుకోటలా మారిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి పెద్ద సంఖ్యలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు శనివారం తెలంగాణ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోనే అత్యధికంగా బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వచ్చాయన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ రానున్న పార్లమెంట్‌లో కూడా బీఆర్ఎస్‌కు అత్యధిక ఓట్లను తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ఇప్పుడే బయటపడుతుందని, వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పిన మాటలను కూడా నెరవేర్చడం కష్టమే అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌కు కార్యకర్తలతో కలిసి వచ్చిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

శంషాబాద్ రూరల్, జనవరి 20: శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు సీఎస్‌కే కాలనీలో వాటర్ పైపులైన్ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంషాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి చేయడం కోసం అవసరమైన నిధులు కేటాయిస్తానని అన్నారు. ఇప్పటికే శంషాబాద్ మున్సిపాలిటీని ఆదర్శంగా తయారు చేయడానికి కేట్లాది రూపాయాలు కేటాయించి అభివృద్ధి చేశానని వివరించారు. శంషాబాద్ మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి తాగునీటి సమస్యలు లేకుండా చేశామన్నారు. వేసవిలో సైతం తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని వార్డులకు పైపులైన్లు వేశామన్నారు. గత ప్రభుత్వం గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి తాగునీటిని అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కమిషనర్ భోగేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు గణేష్ గుప్త, వెంకటేశ్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ బండి భాగ్య లక్ష్మి, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ యాదవ్, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, అమృతారెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాటర్ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

మహావీర్ కళాశాలలో ప్లేస్‌మెంట్స్ డ్రైవ్

మైలార్‌దేవపల్లి, జనవరి 20: విద్యార్థులు తమ లక్ష్యసాధనకు పట్టుదలతో చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మహావీర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ అన్నారు. మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో శనివారం ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, బీటెక్ డిప్లమాకు చెందిన విద్యార్థులకు ఎస్‌పీఆర్ హ్యూమన్ క్యాపిటల్ సొల్యూషన్స్ సంస్థ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించింది. కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులను సంస్థ ప్రతినిధులు ఎంపిక చేసుకొని ఉద్యోగవకాశాలు అందజేశారు.

అగ్ని ప్రమాదంలో మూడు కార్లు దగ్ధం

బంజారాహిల్స్, జనవరి 20: బంజారాహిల్స్‌లో అగ్ని ప్రమాద ఘటనలో మూడు కార్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం:4లోని ఓ అపార్ట్‌మెంట్ బయట చాలా కాలంగా పార్క్ చేసిన ఓ కారును స్టార్ట్ చేసేందుకు అమర్‌నాథ్ అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం ప్రయత్నించాడు. చాలా కాలంగా కారు వినియోగంలో లేకపోవడంతో కొన్ని వైర్లు తెగి షార్ట్ సర్క్యూటైంది. దీంతో మంటలు చెలరేగగా, కారులో నుంచి అమర్‌నాథ్ బయటకొచ్చేశాడు. మరో రెండు కార్లకు కూడా క్షణాల్లో మంటలంటుకోవడంతో డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు.

ఓటర్ల సవరణను త్వరగా పూర్తి చేయండి

బండ్లగూడ, జనవరి 20: ఓటర్ల సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఓటర్ల సవరణకు రెండు రోజులు సమయం ఓటర్ల సవరణ ఈనెల 21తో ముగియనుండటంతో బీఎల్ఓలతో ఆయా పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ఎర్రగడ్డ: ఓటరు నమోదు, ఓటరు జాబితా పరిశీలనల నిమిత్తం బల్దియా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఈ శిబిరాలను నేటి సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. బీఎల్ఓలతో పాటు సహాయకులు అందుబాటులో ఉండి ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

నమోదుకు స్పెషల్ సమ్మరి రివిజన్

జూబ్లీహిల్స్: పోలింగ్ స్టేషన్లలో ఓటరు నమోదు, సవరణలకు స్పెషల్ సమ్మరి రివిజన్ క్యాంపులు ఏర్పాటుచేశారు. జూబ్లీహిల్స్‌లోని పోలింగ్ స్టేషన్లలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలోని 329 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పెరిగిన 352 పోలింగ్ బూత్‌లలో బీఎల్ఓలు నూతన ఓటరు నమోదు, సవరణలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న ఈ స్పెషల్ క్యాంపుల్లో 18 ఏండ్లు నిండిన యువతతో పాటు ఆయా ప్రాంతాలలో కొత్తగా వచ్చిన వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలని, చనిపోయిన వారి పేర్లు తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరారు.

ఘనంగా అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ

బండ్లగూడ, జనవరి 20: అయోధ్యలో ఈనెల 22న శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని శిశు మందిరం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఐటీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడ నుంచి ఆరె మైసమ్మ దేవాలయం వరకు శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ర్యాలీలో పాల్గొని జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

బైరాగిగూడ నుంచి ప్రారంభమైన అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ శోభాయాత్ర

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్ దేవపల్లి, జనవరి 20: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. కాటేదాన్ సబ్‌స్టేషన్-1 పరిధిలోని పారిశ్రామికవాడ, సాయిబాబానగర్, గాయత్రీ ఇండస్ట్రీయల్ లైన్, టీఎన్‌జీవోస్ కాలనీ, అమ్మా గార్డెన్‌లలో ఉ॥ 10.30 గంటల నుంచి మ॥ 1.30 వరకు, సబ్‌స్టేషన్-2 పరిధిలో ఇండస్ట్రీయల్ ఐడిఏ, రవిపుడ్స్ లైన్, నేతాజీనగర్, శ్రీరామ్‌నగర్ కాలనీలలో ఉ॥ 2.30ల నుంచి సా॥ 5 గంటల వరకు...

నాణ్యమైన విద్య సర్కారు బడులకే సాధ్యం

29న మణికొండ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు

తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు

మణికొండ, జనవరి 20: నాణ్యమైన విద్య సర్కారు పాఠశాలల్లోనే సాధ్యమవుతుందని మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 29న జరిగే పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరై ఉత్తమ వ్యక్తులను కమిటీలో ఎన్నుకోవాలని సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అనంతరం, ఏర్పాటు చేసిన సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మణికొండ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నతమైన స్థానాల్లో ప్రస్తుతం స్థిరపడ్డారని గుర్తుచేశారు. నాణ్యమైన విద్యా బుద్ధులు సర్కారు బడుల్లోనే సాధ్యమవుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాంగ్యనాయక్, కౌన్సిలర్ వసంత్ చౌహాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆఫీసుకు వెళ్లొచ్చేసరికి చోరీ

బంజారాహిల్స్, జనవరి 20: ఆఫీసుకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగినది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.., బంజారాహిల్స్ రోడ్ నం.10లోని గౌరీశంకర్ కాలనీలో ఉంటున్న గౌతమ్‌సింగ్ జమేదార్(23) బంజారాహిల్స్ రోడ్ నం.3లోని ఫెడరల్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 19న ఉదయం యధావిధిగా గదికి తాళం వేసి ఆఫీసుకు వెళ్లాడు. రాత్రి ఆఫీసు నుంచి తిరిగి వచ్చి చూడగా, ఇంటి తాళం పగలగొట్టబడి కనిపించింది. లోనికి వెళ్లి చూడగా గదిలో ఉండాల్సిన లెనోవా ట్యాబ్, రిస్ట్ వాచ్, రూ.30వేల నగదు కనిపించలేదు. ఈ మేరకు గౌతమ్‌సింగ్ శనివారం ఉదయం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ 480, 454 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దృష్టి మరల్చి మొబైల్ ఫోన్ తస్కరణ

బంజారాహిల్స్, జనవరి 20: బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన నాయకుడి దృష్టి మరల్చి సెల్ ఫోన్ తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.., రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం దేవనపల్లి గ్రామానికి చెందిన మండల బీసీ విభాగం బీఆర్ఎస్ నేత కె.మల్లేష్ గురువారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ సమావేశానికి హాజరయ్యాడు. సమావేశం అనంతరం భోజనం చేస్తున్న మల్లేష్ వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మాటలు కలిపారు. ఎక్కడి నుంచి వచ్చారంటూ ఓ వ్యక్తి ప్రశ్నిస్తుండగా మరోవ్యక్తి అతడి ప్యాంట్ జేబులో ఉన్న ఒన్‌ప్లస్ మొబైల్‌ను కొట్టేశాడు. కాసేపటికి ఫోన్ పోయిన విషయాన్ని గమనించిన మల్లేష్ అందరినీ వాకబు చేసినా ప్రయోజనం లేకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కానిస్టేబుల్ బైక్ చోరీ..

వెంగళరావునగర్, జనవరి 20: పోలీసు కానిస్టేబుల్ బైక్ చోరికి గురైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఉదయ్ తెలిపిన ప్రకారం, మధురానగర్‌లో నివాసం ఉండే డి.పృథ్వి రాజ్ డీజీపీ కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మధురానగర్‌లోని భవ్య హాస్టల్‌లో ఉంటున్నారు. 18వ తేదీ రాత్రి 9.30 గంటలకు తన బైక్‌ను పార్క్ చేసి హాస్టల్‌లోకి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం హాస్టల్ బయట పార్క్ చేసిన తన బైక్ కనపించలేదు. చోరీకి గురైందని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దిద్దుబాటులో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

బంజారాహిల్స్, జనవరి 20: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.4లోని రాడిసన్ బ్లూ ఫ్లాజా హోటల్‌లో శనివారం అంబిషన్స్ కెరీర్ కౌన్సిలర్స్ ఎక్సలెన్సీ-2024 అవార్డుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులు, లెక్చరర్లకు విద్యా సంస్థలకు ఎక్సలెన్సీ అవార్డులు అందించిన అనంతరం, రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఉపాధ్యాయులు తరగతి గదిలో ఏది చెబితే దాన్ని మాత్రమే విద్యార్థులు నేర్చుకునే వారని, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ, ఇంటర్‌నెట్ వినియోగంతో విద్యార్థులతో పోటీపడి నిరంతరం తమలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం అధ్యాపకులకు ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో అవినాష్ కాలేజ్ చైర్మన్ అవినాష్ బ్రహ్మదేవర, హెచ్ఎస్‌బీ బెంగళూరు చైర్మన్ డా.జయప్రకాష్, నగరం సాయిరామ్ పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

ఎయిడెడ్, నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలి

హిమాయత్‌నగర్, జనవరి 20: రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలలో విధులు నిర్వహించే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలలో విలీనం చేసే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని తెలంగాణ ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కాలేజీ జేఏసీ ప్రతినిధి బృందం శనివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా జేఏసీ ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణా రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బి.లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలో 260 మంది, డిగ్రీ కాలేజీలో 450 మంది టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. సాంబశివరావు సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్య పరిష్కారం అయ్యేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారని వారు చెప్పారు.

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సాంబశివరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జేఏసీ నాయకులు

ప్రజా కళలను రక్షించాలి

ఇప్టా జాతీయ కార్యదర్శి పల్లె నరసింహ

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పల్లె నరసింహ

హిమాయత్‌నగర్, జనవరి 20: సమాజంలోని సకల వర్గాలకు స్వేచ్ఛ, సమానత్వం దక్కడంతో పాటు ప్రజా కళలను పరిరక్షించాలని ఇప్టా జాతీయ కార్యదర్శి పల్లె నరసింహ అన్నారు. కళాకారులపై జరుగుతున్న దాడులను నియంత్రించాలని, ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతర కార్యక్రమంకు కళాకారులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంక్ బండ్‌పై ఉన్న మఖ్దూం మొహిద్దీన్ విగ్రహం నుంచి ప్రారంభమై హయత్‌నగర్, యాదగిరిగుట్ట మీదుగా హన్మకొండ వరకు కళాజాత కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు లక్ష్మి నారాయణ, ఉప్పలయ్య, కొండల్‌రావు, రవి, పి.నళిని వై.రాజేశ్వర రావు, డి.వేణు, సమయ్య, పి.విజయ, గణేష్ పాల్గొన్నారు.

హంతకుడికి బెయిల్ ఇవ్వొద్దు

పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య

ఖైరతాబాద్, జనవరి 20: అబ్దుల్లాపూర్‌మెట్ హత్య కేసులో హంతకుడైన భర్తకు బెయిల్ ఇవ్వకూడదని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. ఉమెన్స్ అండ్ ట్రాన్స్‌జెండర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉంటున్న పుష్పలత చిన్నప్పుడు బాలల గృహంలో ఉండి చదువుకొని సొంత కాళ్లపై నిలబడిందన్నారు. విజయ్ కుమార్‌ను పెండ్లి చేసుకున్న తర్వాతే ఆమెకు కష్టాలు మొదలయ్యాయని, 15 ఏండ్లుగా ఆమెను అనేక విధాలుగా వేధించాడన్నారు. అతని వేధింపులను భరించలేకే భర్తకు దూరంగా ఉంటుందన్నారు. చివరకు భర్త చేతిలో దారుణ హత్యకు గురైందని, అయితే కొన్ని మీడియా సంస్థల్లో ఆమెకు మూడో వివాహం అని ప్రసారం చేశాయని, అది వాస్తవం కాదన్నారు. నిజా నిజాలు తెలుసుకునేందుకు జేఏసీ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ వేసి వాస్తవాలు తెలుసుకున్నామన్నారు. బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడమే కాకుండా కష్టపడి పిల్లలను పోషించుకుంటున్న పుష్పలతను హత్య చేసిన నిందితుడిని తప్పించే ప్రయత్నం జరుగుతుందని, అతనికి కఠిన శిక్ష పడేంత వరకు తాము ఉద్యమిస్తామన్నారు. అనాథలైన ఆమె పిల్లలకు రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఉంచి చదివించాలని, ప్రభుత్వం వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. దళితురాలైన మృతురాలికి చట్ట ప్రకారం సంక్రమించే సొమ్మును ఆమె కుమార్తెకు 18 ఏండ్లు వచ్చే వరకు ప్రభుత్వ పర్యవేక్షణలో బ్యాంకులో డిపాజిట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఖలీదా, సజయ, కృష్ణ కుమారి, సుజాత, గోపీశంకర్, సునీత్ పాల్గొన్నారు.

PARADISE VENTURES PRIVATE LIMITED
Sy. No. 10 to 17, Sikenderguda Village, Rajendranagar (Gandipet)Mandal, Hyderabad

PUBLIC NOTICE

Notice is given to the general public that **PARADISE VENTURES PRIVATE LIMITED** is currently undertaking legal measures to complete the mutation process, establishing rightful ownership of the land measuring **Ac.12.35 Guntas** in **Survey Nos. 14,15 & 16,** located at Sikenderguda Village, Rajendra Nagar (Gandipet) Mandal, Hyderabad by the sale deed **Document No. 25012 of 2006, dated 14.11.2006,** in favor of Paradise Ventures Private Limited, the Telangana State government has asserted its claim to this land, leading to ongoing litigation in the high court between the company and the government.

Simultaneously, we've observed ongoing construction activities on properties in **Sy. No. 14, 15, and 16**. The neighbor is making false claims, indicating a connection between the constructions in **Sy. No. 10, 11, 12, 13, and 17,** which is illegal and misrepresenting to the general public.

In light of these developments found in **12.35 Acres in Sy No. 14, 15, and 16,** this public notice is issued to inform and caution the general public against engaging in any transactions related to the mentioned property. Any person(s) entering into transactions concerning any part of the said property does so at their own risk. The company does not acknowledge or endorse any clandestine agreements or sales in this regard.

S. RAVI KUMAR, Advocate, Ph No. 9581780580

తక్కువ ధరకు బట్టలు కుట్టివ్వలేదని..

టైలర్ షాపునకు నిప్పు..

బంజారాహిల్స్, జనవరి 20: తక్కువ ధరకు బట్టలు కుట్టివ్వలేదన్న కోపంతో టైలర్ షాపును పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.., షేక్‌పేట సమీపంలోని గుల్షన్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ ఖదీర్(41) అనే టైలర్ పదేళ్లుగా లక్ష్మీనగర్‌లో ఆయాన్ టైలరింగ్ షాప్ నడిపిస్తున్నాడు. పదిహేను రోజుల క్రితం మసూద్ హుస్సేన్ అనే వ్యక్తి ఖదీర్ వద్దకు వచ్చి కొన్ని బట్టలిచ్చి డ్రెస్‌లు కుట్టాలని కోరారు. వాటికి రూ. 1200 అవుతుందని చెప్పగా తాను కేవలం రూ.800 మాత్రమే ఇస్తానని మసూద్ చెప్పాడు. అయితే, అంత తక్కువలో కుట్టడం వీలు కాదని చెప్పినా వినిపించుకోకుండా మళ్లీ వస్తానంటూ.. బట్టలు అక్కడే పెట్టి వెళ్లాడు. ఈ నెల 18న మరోసారి షాపు వద్దకు వచ్చిన మసూద్ హుస్సేన్ డ్రస్‌లు కుట్టావా? అని ప్రశ్నించగా రేటు ఫైనల్ చేయకపోవడంతో కుట్టలేదని టైలర్ ఖదీర్ చెప్పాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మసూద్ దుర్భాషలాడటంతో పాటు అతడి బట్టలు తీసుకుని వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో మరుసటిరోజే టైలరింగ్ షాపునకు నిప్పంటుకుంది. షాపులో కొన్ని బట్టలు దగ్ధమయ్యాయి. షాపు వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించగా మసూద్ పెట్రోల్ పోసి నిప్పంటించడం కనిపించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భవన నిర్మాణ వ్యర్థాలు ఖాళీ స్థలాలలో వేస్తే కఠిన చర్యలు

సూచనలతో కూడిన బ్రోచర్ల ఆవిష్కరించిన జోనల్ కమిషనర్ వెంకన్న, బీసీ రవి కుమార్

బండ్లగూడ, జనవరి 20: భవన నిర్మాణ వ్యర్థాలను ఖాళీ స్థలాలతో పాటు మూసీనది వెంట డంపింగ్ చేసినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ వెంకన్న పేర్కొన్నారు. బీసీ రవి కుమార్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో శనివారం భవన నిర్మాణ వ్యర్థాలకు సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ కమిషనర్ వెంకన్న ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవన నిర్మాణదారులు తమ ఇంటి నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయవద్దన్నారు. వినకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇతర వివిధ విభాగాలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భళా.. హస్తకళా ప్రదర్శన

మగువలను ఆకర్షించే పట్టు ఉత్పత్తులు, చేనేతలు

సిటీబ్యూరో, జనవరి 20(నమస్తే తెలంగాణ): క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత పట్టు ఉత్పత్తుల ప్రదర్శన సత్యసాయి నిగమాగమంలో గురువారం కొలువుదీరిన విషయం తెలిసిందే. ప్రముఖ గాయని లక్ష్మి గాయత్రి వేదాంతం ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించగా, సందర్శకులతో మూడు రోజులుగా ప్రదర్శన కిటకిటలాడుతున్నది. దేశంలోని పలు నగరాల చేనేత కారులు ఒకే వేదికపై హ్యాండ్‌లూమ్స్ ప్రదర్శనను అందుబాటులో ఉంచడంతో నగర నలు మూలల నుంచి వినియోగదారులు ప్రదర్శనకు వందలాదిగా విచ్చేస్తున్నారు. ఈ ప్రదర్శన ఈనెల 24 వరకు కొనసాగనుంది. దేశంలోని 14 నగరాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు సిల్క్, హ్యాండ్లూమ్, డ్రెస్ మెటీరియల్ తదితర 50 రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు.